క్లుప్తంగా

అధిక దిగుబడులకు భూసార పరీక్షలు తప్పనిసరి

అమరావతి: రైతులంతా భూసార పరీక్షలు చేయించుకొని, తద్వారా సాగులో సమగ్ర సస్యరక్షణ విధానాలను అవలంబించటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏల సహాయంతో మట్టి నమూనాలను సేకరించాలన్నారు. పొలంలోని నాలుగు మూలల మట్టిని సేకరించి.. అన్నింటిని కలిపి ఒకే రకం నమూనాను పరీక్షకు పంపాలన్నారు. దీంతో భూమిలో నత్రజని, సల్ఫర్, పొటాషియం ఎంత మోతాదులో ఉన్నాయే తెలుసుకోవచ్చన్నారు. వేసవిలో ఉచితంగా నిర్వహించే భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాజుపాలెం: మండలంలోని గణపవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వీవీ ప్రసాద్ శనివారం తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ జరుగుతుందని మెప్మా టీఎంసీ నాగేశ్వరి శనివారం తెలిపారు. పట్టణంలోని 702 స్వయం సహాయక సంఘాల్లోని 6,936 మంది సభ్యులకు రూ.5,68,43,456 వైఎస్సార్ ఆసరా కింద జమ చేయడం జరుగు తుందన్నారు. మూడో విడతతో కలిపి రూ.17.05 కోట్లు మహిళా స్వయం సహాయక సంఘాలకు లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల.లక్ష్మీతులసి, వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, మున్సిపల్ కమిషనర్ కొలిమి.షమ్మి, మెప్మా అధికారులు హాజరవుతారన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘ సభ్యులు హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

నేడు రాజుపాలెం గృహసారథులకు శిక్షణ

రాజుపాలెం: మండలకేంద్రం రాజుపాలెం అంకమ్మతల్లి దేవాలయం పక్కన నేడు గ్రామ వలంటీర్లకు, గృహసారధులకు, గ్రామ సచివాలయ కన్వీనర్లకు ఒక్కరోజు శిక్షణ నిర్వహిస్తున్నట్లు గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పులిబండ్ల అశోక్ శనివారం తెలిపారు. రెడ్డిగూడెం, మొక్కపాడు, బ్రాహ్మణపల్లి, రాజుపాలెం , చౌటపాపాయపాలెం, కొత్త బోధనం గ్రామాలకు సంబందించిన వలంటీర్లకు, గ్రామ సచివాలయ కన్వీనర్‌లకు, గృహసారధులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జలవనరుల శాఖ మాత్యులు అంబటి రాంబాబు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ గ్రామాలకు సంబందించిన ప్రజా ప్రతినిధులు, హాజరు కావాలని తెలిపారు.

నేడు మదరసా భవనానికి శంకుస్థాపన

అచ్చంపేట: కస్తలలో మదరసా భవన నిర్మాణానికి ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే నంబూరు శంకరంవు శంకుస్థాపన చేస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వినర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. 5గంటల నుంచి అచ్చంపేట 1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొంటారని ఆయన తెలిపారు.

'పది' పరీక్షలకు ఐదు కేంద్రాలు

క్రోసూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ ఏసురత్నం శనివారం తెలిపారు. సోమవారం నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పబ్లిక్ పరీక్షలకు మొత్తం 926 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. క్రోసూరు జెడ్పీ, మోడల్ స్కూల్, జై భారత్ పబ్లిక్ స్కూల్, దొడ్లేరు జెడ్పీ ఉన్నత పాఠశాల, ఊటుకూరు జెడ్పీ ఉన్న పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

నకరికల్లు: పిడుగుపాటుకు గురైన వ్యక్తి మృత్యువాతపడ్డాడు. ఈ ఘటన మండలంలోని చాగల్లు గ్రామంలో శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిందా నాగరాజు (40) తన కౌలుపొలంలో కోసిన మిరపకాయలను గ్రామశివారులో ఎండబెట్టాడు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు సంభవించి వర్షం, ఈదురుగాలులు వీస్తుడడంతో మిర్చిపై పట్టాలు కప్పుకుంటున్నాడు. ఈ క్రమంలో అతనికి అతిసమీపంలో పిడుగుపడడంతో తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. స్పందించిన స్థానికులు 108లో నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతిచెందాడు. మృతునికి భార్య పద్మావతి, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

సీఎం వైఎస్ జగన్ ఆశయం..ఆచరణే లక్ష్యం

- మంచి చేశాననిపిస్తే.. ఆశీర్వదించండి
- 'ఆసరా' నగదు పంపిణీలో ఎమ్మెల్యే శంకరరావు



వైఎస్సార్ ఆసరా నగదు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: ప్రతి పేదవాడికి మంచి జరగాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రమిస్తున్నారని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. పెదకూరపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అధ్యక్షత వహించారు. మహిళలు ఎమ్మెల్యే శంకరరావుకు పూలతో స్వాగతం పలికారు. పొదుపు సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. పెదకూరపాడు మండల స్వయం సహాయక సంఘాలకు రూ.6.63 కోట్ల ఆసరా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే తన లక్ష్యమన్నారు. నాడు రుణ మాఫీ పేరుతో మహిళలను, రైతులను నారా చంద్రబాబు నాయుడు మోసం చేశారని గుర్తుచేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సుమారు రూ.1,400 కోట్లతో సంక్షేమ సాయం, రూ.600 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గత పాలకులు విస్మరించిన అమరావతి -తుళ్ళూరు డబుల్ రోడ్డు, బెల్లంకొండ -అమరావతి డబుల్ రోడ్డు, కృష్ణా నదిపై బ్రిడ్జి పనులు తాను సాధించానని చెప్పారు. ఈ నెలలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమం ప్రజలకు నచ్చితే వచ్చే ఎన్నికల్లో జగనన్నను, తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, శావాజి, పార్టీ మండల అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్, సచివాలయాల మండల కన్వీనర్ మాగులూరి అనిల్ కుమార్, వైఎస్ ఎంపీపీలు చాంద్ బాషా, మేరి బత్తుల కోటేశ్వర రావు, నల్లపాటి యోహాన్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి అంబటి పరామర్శ

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెపాటిబాబు కుటుంబ సభ్యులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటిరాంబాబు శనివారం పరామర్శించారు. మాదల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని బాబు మృతిచెందిన ఘటన తెలిసిందే. ఆ మేర బాబు తండ్రి మార్కు ను పరామర్శించి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. గ్రామానికే చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలు నేలపాటిజోజికన్న (55) అనారోగ్యంతో శనివారం మృతి చెందగా ఆమె మృతదేహాన్ని మంత్రి అంబటిరాంబాబు సందర్శించి నివాళులర్పించారు. ఆయన తో పాటుగా వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, యనమాలసింగయ్య, శిరిగిరిగోపాలరావు, నక్కాశ్రీనివాసరావు, పాతూరిరామయ్య, కోటేశ్వరరావు, అప్పిరెడ్డి, జక్కిరెడ్డి తదితరులు ఉన్నారు.

కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్‌గా బ్రహ్మరాజు



సత్తెనపల్లి: పట్టణంలోని కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ గా పనిచేస్తున్న ప్రత్తిగుడుపు బ్రహ్మరాజు డివిజనల్ మేనేజర్ గా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని కెనరా బ్యాంక్ బ్రాంచ్ సిబ్బంది బ్రహ్మరాజు సేవలను కొనియాడారు. పూల మాలలు, దుశ్శాలువాలతో ఆయనను ఘనంగా సత్కరించారు. బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్స్ అనురాధ, విప్లవ్, రాజేశ్వరి, దీప్తి, జానీభాష, మల్లికార్జున రావు, దేవరశెట్టి రవికుమార్, తదితరులు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

అచ్చంపేట: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తాళ్ల చెరువులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింతా రాజకుమార్(44) పొలానికి వెళ్లి వచ్చి..ఇంట్లో హీటర్‌తో వేడి నీళ్ల పెట్టుకుంటుండగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలి పడిపోయాడు. అతనిని కుటుంబ సభ్యులు 108 వాహనంలో సతెనపల్లి తరలిస్తుండగా అచ్చంపేటకు వచ్చేసరిగా మృతి చెందాడు. మృతునికి భార్య జ్యోతి, ముగ్గురు సంతానం ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బెల్లంకొండ: బెల్లంకొండలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పర్యటించనున్నట్లు ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వర రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పొదుపు సంఘాల మహిళలకు వై ఎస్సార్ ఆసరా పథకం నగదు చెక్కుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



ఎమ్మెల్యే నంబూరుశంకరరావు సమక్షంలో పార్టీలో చేరిన దిగుడు టీడీపీ కార్యకర్తలు

క్రోసూరు: నియోజవకవర్గంలో వైఎస్సార్ సీపీ రోజురోజుకీ మరింత బలపడుతోందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. అమరావతి మండలం దిడుగు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పలువురు శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. క్రోసూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే శంకరరావు వారికి పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందన్నారు. రాబోయో ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ కుటుంబంలో ప్రతి ఒక్కరికి తాను అండగా ఉంటానని బరోసానిచ్చారు. మాగులూరి ఉదయరాజు, మాగులూరి బాలస్వామి, మాగులూరి నరసింహారావు, సూర్యప్రకాష్, అశోక్, మద్దు కలిస్టిన్, బొల్లావల్ల రంగయ్య, అల్లాబక్షు, అనిల్ పార్టీలో చేరని వారిలో ఉన్నారు.

జగన్ మామయ్య పేరు నిలబెట్టాలి



పదో తరగతి విద్యార్థులతో ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు: 'విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ.. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి, మీ జగన్ మామయ్య పేరు నిలబెట్టాలి.' అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పదో తరగతి విద్యార్థులకు సూచించారు. పెదకూరపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుతో ఆయన శనివారం ముచ్చటించారు. పరీక్ష సన్నద్ధతపై వారితో మాట్లాడారు. లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి , శివాజి పాల్గొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

సత్తెనపల్లి ఉపవిద్యాశాఖధికారి వెంకటేశ్వరరావు



వి.వెంకటేశ్వరరావు

సత్తెనపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు సత్తెనపల్లి ఉప విద్యా శాఖాధికారి వి.వెంకటేశ్వరరావు చెప్పారు. ఈనెల మూడో తేదీ నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల ఏర్పాట్లపై ఆయన శనివారం మాట్లాడారు. పరీక్షల సన్నద్ధతత పై పలు విషయాలు వెల్లడించారు.

ఈ ఏడాది ఆరు ప్రశ్నపత్రాలే...

గతంలో మాదిరి 11 ప్రశ్న పత్రాలు ఉండవు. ఈ ఏడాది ప్రభుత్వం వాటిని కుదించి ఆరు ప్రశ్నాపత్రాలుగా మార్పు చేసింది. సైన్స్ కు సంబంధించి జీవ, రసాయన, భౌతిక శాస్త్రాలు ఒకే పరీక్షగా నిర్వహిస్తారు. ఒక్కో విద్యార్థికి ముందుగా 24 పేజీలు ఉండే జవాబు పత్రం ఇస్తారు. అది పూర్తిగా రాసిన విద్యార్థులు కావాలంటే అదనంగా మరో 12 పేజీలు ఉండే జవాబు పత్రం తీసుకోవచ్చు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా జవాబు పత్రాలపై వరుస సంఖ్య ఉంటుంది. దీంతో ఒక విద్యార్థి పత్రాలు మరొక విద్యార్థి వద్ద ఉంటే సులభంగా గుర్తించి చూసి రాసే వారిని అరికట్ట వచ్చు.

డివిజన్ వ్యాప్తంగా 56 పరీక్షా కేంద్రాలు.....

సత్తెనపల్లి డివిజన్ పరిధిలో 14 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 56 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించాం. 'ఏ' కేటగిరీలో 23, 'బి' కేటగిరిలో 25, 'సీ' కేటగిరీలో 8 పరీక్షా కేంద్రాలు ఉంటాయి. ఈ కేంద్రాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు 11,950 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 11,090 మంది, ప్రైవేట్ విద్యార్థులు 860 మంది ఉన్నారు. వీరిలో బాలురు 5,300 మంది, బాలికలు 6,650 మంది. పరీక్షల్లో విధులు నిర్వహించే పరిశీలకులకు, డిపార్ట్ మెంట్ అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు...

ప్రతి పరీక్ష కేంద్రంలోనూ గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాటులు చేశాం. ముఖ్యంగా మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలని ఇప్పటికే సూచించాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థికి ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే చూసేందుకు ఆరోగ్య కార్యకర్తలు ఉంటారు. పరీక్షల సమయంలో హాల్ టికెట్ చూపించి 10వ తరగతి విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చు. రోజు కొన్ని కేంద్రాలను నిర్దేశించుకొని వాటిని పరిశీలిస్తున్నాం.

విద్యార్థులకు ఇచ్చే సూచనలు...

ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తాం. ఆఖరి నిమిషంలో హడావుడిగా కాకుండా ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవడం మంచిది. ఎల్రక్టానిక్ వస్తువులేమీ వెంట తీసుకు రాకూడదు. ఉన్న ఈ కొద్ది సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

అమరావతి: అమరావతిలో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన పరీక్షల నిర్వహణ వివరాలు వెల్లడించారు. అమరావతిలోని శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్‌లో 239, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 315 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. రెండు పరీక్ష కేంద్రాల్లో బల్లలు, తాగునీటి వసతి, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ముప్పాళ్ళ: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలోని పరీక్ష ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. మండల పరిధిలోని దమ్మాలపాడు, బొల్లవరం, నార్నెపాడు, ముప్పాళ్ళ, కేజీబీవీ పాఠశాలలకు చెందిన 240 మంది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. విద్యార్థులకు అవసరమైన బెంచీలు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. పరీక్షల నేపథ్యంలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్‌లను మూసివేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ రూపవతి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భవానిశంకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు



బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న పద్మావతి

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మాదల(ముప్పాళ్ళ): విద్యార్థి ఆలోచన విధానమే జీవన ఉన్నతికి కారణమని, సానుకూల దృక్పథంతో ముందుకు వెళితే ప్రశాంతంగా పరీక్షలు రాయగలరని ఏపీ రాష్ట్ర చైల్డ్ రైట్స్ యాక్ట్ సభ్యురాలు బి.పద్మావతి చెప్పారు. మండలంలోని మాదలలో గల మహాత్మాజ్యోతిభాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ సహకారంతో పదో తరగతి విద్యార్థినులకు అవసరమైన పరీక్ష సామాగ్రిని శనివారం అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పద్మావతి మాట్లాడుతూ మంచి భవిష్యత్తుకు పునాది పదో తరగతి నుంచి ప్రారంభమవుతాయని, చదువు ద్వారా ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తోందని, హక్కుల ద్వారా ప్రతి వ్యక్తి అభివృద్ధి మార్గంలో ముందుకు వెళ్తారని చెప్పారు. ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ మిరియాల వెంకటేశ్వరరావు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, ఫౌండేషన్ అడ్వైజర్ ప్రతాప్‌బాబు, సభ్యులు నాని, సోమశేఖర్, సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'పై అవగాహన



జగనన్నే మా భవిష్యత్తు కిట్‌పై వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సచివాలయ ఇన్‌చార్జులకు, గ్రామ వలంటీర్లకు, గృహసారధులకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శిక్షణ తరగతిని మండలంలోని కండ్లకుంట గ్రామంలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కోసం చేసిన సంక్షేమ కార్యక్రమాలను ఈనెల 7వతేదీ నుంచి 14 వరకు సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కిట్‌ను పంపిణీ చేయాలన్నారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వారి ఫోన్ నుంచి మిస్‌డ్‌కాల్ ఇచ్చే కార్యక్రమం చేపట్టాలన్నారు. జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్‌లు గోడలకు, సెల్‌ఫోన్‌లకు అంటించాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నే తిరిగి అధికారంలోకి వచ్చేవిధంగా సమష్టి కృషితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ కంఠమనేని చందు, కంఠమనేని కోటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ

సత్తెనపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సత్తెనపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ టీ.శ్రీలత అధ్యక్షతన శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడో కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పద్మావతి మాట్లాడుతూ బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలు రోగాల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఆరు రకాలైన సజ్జ పండి, జొన్న పిండి, రాగి పిండి, అటుకులు, బెల్లం పప్పు చెక్క, బెల్లం అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఎలవర్తి పార్టీ జైబూన్ బి, ఎంపీడీఓ జీవీ సత్యనారా యణ, తహసీల్దార్ కే నగేష్, ఎంఈఓ ఏ.శ్రీనివాసరావు, సూపరిండెంట్ సీహెచ్ బసవ కుమారి, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు, ఏసీడీపీఓ టీ.సంతోష్ కుమారి, సెక్టార్స్ సూపర్‌వైజర్లు అరుణ, జయలక్ష్మి, స్వర్ణలత, ఆశ, గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలు, తదితరులు ఉన్నారు.

కల్లాల్లోకి చేరిన వర్షం నీరు



ముప్పాళ్ళ: ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పంటలు నీటిపాలయ్యాయి. పంటలను వర్షం నుంచి కప్పుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతంతో పాటుగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని దమ్మాలపాడు, మాదల, రుద్రవరం, తొండపి గ్రామాల్లో కురిసిన వర్షానికి కల్లాల్లో ఉన్న మిరప, పసుపు, మొక్కజొన్న పంటలు తడిచిపోయాయి. ఒక్క దమ్మాలపాడులోనే సుమారు 20 ఎకరాలకు పైగా మిరప కల్లాలు తడిచిపోయాయి. గ్రామానికి చెందిన మున్నంగి ప్రకాశరెడ్డి కి చెందిన ఐదు ఎకరాలు, బద్దిగంవీరారెడ్డి కి చెందిన రెండు ఎకరాలు, పిచ్చిరెడ్డికి చెందిన రెండెకరాలు, తమ్మినేని వెంకటరెడ్డి కి చెందిన రెండెకరాలు, వెంకట్రావు కు చెందిన రెండెకరాల్లోని మిరప కల్లాల్లోని మిరప కాయలు తడిచిపోయాయి. కల్లాలపై కప్పిన పట్టాలు సైతం ఈదురుగాలులకు లేచిపోయి వర్షపు నీరు కల్లాల్లో నిలిబడిపోయింది. వర్షపు నీటిని బయటకు పంపించేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. వర్షానికి తడిచిన మిరప కాయలు రంగుమారి ధర తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి చిరునామాగా అచ్చంపేటను తీర్చిదిద్దాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: అచ్చంపేటను మూడున్నరేళ్లలో అభివృద్ధికి చిరునామాగా మార్చామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి అచ్చంపేటలోని 1, 2 సచివాలయాల పరిధిలో ఆయన ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యలను అడికి తెలుసుకుని, అక్కడికక్కడే అధికారులతో చర్చించారు. మూడున్నరేళ్లలో అచ్చంపేటలో రూ. 2 కోట్లతో సకల సౌకర్యాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించామని చెప్పారు. జిల్లా పరిషత్ హైస్కూలు, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధి బాలికల పాఠశాలలో రూ.5.30కోట్లతో అదనపు తరగతి భవనాలను నిర్మించినట్లు చెప్పారు. రాజీవ్‌నగర్ కాలనీలో రూ.72లక్షలతో సైడ్ డ్రెయిన్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా కృష్ణా జలాలను ప్రతి ఇంటికి రెండు పూట్ల ఇచ్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే చెప్పారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వినర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణానాయక్, సర్పంచ్ కంబాల వీరబాబు, మాజీ సర్పంచ్ టీవీఎస్ మల్లికార్జునరావు, ఉప ఎంపీపీ గంగసాని బాబు, ఎంపీటీసీలు తెల్లమేకల నాగరాజు, షేక్ మోహిద్దీన్, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి చిన్నియల్లమందయ్య, ఉప సర్పంచ్ షేక్ జాని, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని, మండల బీసీ సేన అధ్యక్షుడు షేక్ జాని, దళిత నాయకులు సందెపోగు పున్నారావు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి మహిళ మృతి



శాంతకుమారి మృతదేహం

మాదల(ముప్పాళ్ళ): ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందగా మరో ఇరువురికి గాయాలైన ఘటన మండలంలోని మాదల గ్రామ సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. సంఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన కొరబండిశాంతికుమారి (33) తన స్నేహితురాలు కుమ్మెతకల్పన తో కలిసి తెల్లవారుజామున ఆటోలో సత్తెనపల్లి వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో మాదల పెట్రోల్ బంక్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న శాంతికుమారికి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందగా, కల్పన కు స్వల్ప గాయాలయ్యాయి. ఆటోడ్రైవర్ దుగ్గి నవీన్ కు స్వల్ప గాయాలు కావడంతో గాయపడిన ఇరువురిని 108వాహనంలో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. శాంతికుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తెలిపారు.

ఆర్థికంగా ఎదగాలి



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్‌ల పంపిణీ

అమరావతి: శిక్షణలో నేర్చుకున్న పని ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు మహిళలు కృషి చేయాలని జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధికారి కిరణ్మయి సూచించారు. శనివారం జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. నేటి సామాజిక పరిస్థితులలో కుటుంబం గడవాలంటే మహిళలు కూడా సంపాదించాల్సిన అవసరం ఉందన్నారు.